రైల్వేస్టేషన్లో ఆధునిక సౌకర్యాలు

- ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల పరిధిలో ఏర్పాటు
- అదనపు గదులు, ప్లాట్‌ఫాం, బుకింగ్ సౌకర్యం, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు


పెద్దపల్లిలో రైల్వేస్టేషన్‌లో గదుల నిర్మాణం కోసం తొలగించిన రేకుల షెడ్లు


పెద్దపల్లి రైల్వేస్టేషన్లో ఆధునీకరణ పనుల కోసం కూల్చిన రైల్వేస్టేషన్ బిల్డింగు


పెద్దపల్లిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రారంభమైన ఆధునీకరణ పనులు

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో రైల్వేస్టేషన్ల ఆధునీకరణ సౌకర్యాల పనులకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. జమ్మికుంట, ఓదెల, బిజిగిరి షరీఫ్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి వరకు రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులు ముమ్మరం అయ్యాయి. ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా, వందల సంఖ్యలో రైళ్లరాకపోకలకు అనుకూలంగా ఆయా రైల్వేస్టేషన్లో డిజిటల్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది.

జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి రైల్వేస్టేషన్లో బుకింగు కౌంటర్లు తొలగించి ప్రస్తుతం అదనపు గదుల నిర్మాణాలు చేపడుతోంది. రిజర్వేషన్ల సౌకర్యంతోపాటు నిత్యం నడిచే రైళ్లద్వారా ప్రయాణించే వారు సులభంగా టికెట్లు తీసుకోవడం కోసం బుకింగ్‌లు నిర్మిస్తోంది. పాత బిల్డింగులు కూల్చి, ఫస్టు ప్లాట్‌ఫాం ఆనుకొని ఉన్న షెడ్లను తొలగిస్తోంది. అదనపు పక్కా గదుల నిర్మాణం కోసం పనులు ముమ్మరం చేసింది. ప్రయాణికులు వేచి ఉండే గదులు, రిజర్వేషన్ ప్రయాణికులు వేచి ఉండే గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. రైల్వేస్టేషన్లో ప్లాట్‌ఫాంలు పెరగటంతో ప్రస్తుతం ఉన్నవి కాకుండా ప్రస్తుతం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు.

సౌకర్యాల కల్పన..

ప్రయాణికులకు సౌకర్యం కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫాంలు పెంచడంతో పాటు షెడ్లు నిర్మిస్తోంది. అనౌన్స్‌మెంట్ స్పష్టంగా వినిపించడం కోసం చర్యలు తీసుకుంటోంది. రైల్వేస్టేషన్లో దివ్యాంగ ప్రయాణికుల కోసం వీల్‌చైర్‌లు మరింత పెంచుతున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. మంచినీటి సౌకర్యం కోసం ఫ్రిజ్‌లు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. సౌకర్యాల కల్పనపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం పనితీరు భేష్



రైల్వేస్టేషన్లో ఆధునీకరణ పద్ధతుల్లో సౌకర్యాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం పనితీరు భేష్. పెద్దపల్లి, జమ్మికుంట, రామగుండం, మంచిర్యాల రైల్వేస్టేషన్ల నుంచి నిత్యం విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నా రు. రైల్వేస్టేషన్లో ఆధునిక సౌకర్యాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి.

– గీట్ల దినేశ్‌రెడ్డి, విద్యార్థి, కొలనూర్

ప్రయాణికులకు సౌకర్యాలు



నిత్యం రైళ్ల ద్వారా ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు దూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. రైల్వేశాఖ ప్రస్తుతం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఊహించని విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం. ఇప్పుడు కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలు ప్రయాణికులకు అనుకూలంగా ఉన్నాయి.

– నాగరాజు, మాజీ ఉపసర్పంచు, హరిపురం

పనులు వేగవంతం

రైల్వేశాఖ టెండర్‌లు వేసిన అనంతరం ప్రస్తుతం పెద్దపల్లి రైల్వేస్టేషన్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు మిగతా ఆధునీకరణ పనులు వేగవంతం అయ్యాయి. ఏడాదిలోపు పనులు పూర్తవుతాయి. రైళ్ల రద్దీకి అనుగుణంగా ప్రయాణికులకు అదనపు సౌకర్యాల కోసం డిజిటల్ పనులు కొనసాగుతున్నాయి.

– రాజు, సూపర్‌వైజర్, పెద్దపల్లి

పసుపు వర్ణంలోకి వరిపైర్లు


వరిపైరును పరిశీలిస్తున్న ఏవో సతీశ్

- క్షేత్ర పరిశీలన చేసి నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఏవో

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, సోమనపల్లి, ఆకెనపల్లి గ్రామాల్లో పలుచోట్ల వరి పైర్లు పసుపు వర్ణంలోకి మారుతున్నట్లు తమ దృష్టికి రావడంతో ప్రతీరోజు క్షేత్ర పరిశీలన చేస్తున్నామని అంతర్గాం మండల వ్యవసాయాధికారి సతీశ్ తెలిపారు. శుక్రవారం వరిపైరును పరిశీలించిన అనంతరం నివారణ చర్యలపై రైతులకు వివరించారు. సల్ఫైడ్ దుష్ప్రభావంతో వరిపైర్లు పసుపు వర్ణంలోకి మారే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి నేలలు ఎక్కువగా మెత్తగా ఉండి, అడుగు వేస్తే చాలా లోతు వరకు దిగబడడం, అడుగు వేసిన చోట గాలి బుడగల రూపంలో బయటకు రావడం, చెడు వాసన, మొక్కను వేర్లతో బయటకు తీసినప్పుడు కుళ్లిన వాసన వస్తుందన్నారు. ఈ ప్రాంతంలో పెరిగే వరిపైర్లు పూర్తిగా చనిపోయే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

నివారణ చర్యలు..

- వరి చేనులో నిల్వ ఉన్న నీటిని తొలగించి మళ్లీ కొత్త నీటిని మళ్లించాలి. ఫలితంగా మొక్క వేర్లకు మంచి గాలి అందుతుంది.
- పొలాన్ని అప్పుడప్పుడు సన్నని నెర్రెలు పడేంత వరకు ఆరబెట్టిన తర్వాత మళ్లీ నీరు అందించాలి.
- ఇటువంటి నేలల్లో 20-20-0-13 లేదా 20-20-0-15 వంట సల్ఫర్ కలిగిన ఎరువులు, అమ్మోనియం సల్ఫేట్ ఎరువులు వినియోగించొద్దు.
- 13-0-45 ఎరువులను సూక్ష్మ పోషకాలు కలిగిన ఫార్ములా-4, ఫార్ములా-5, (అగ్రోమిన్ మాక్స్, స్వర్ణఫల్) తదితర ఎరువులతో కలిపి 10రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

గుడి నిర్మాణానికి అనుమతి ఇవ్వండి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జయశంకర్ నగర్ ఏరియాలో పోచమ్మ గుడి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం ఆర్జీ-2జీఎం వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. పోచమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో తిరిగి గుడిని నిర్మించాలని జయశంకర్ నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఏఐటీయూసీ నాయకులు శాంసన్, అన్నారావు, సాంబశివరావు, రవికుమార్, మహేందర్, రాజ్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఊపందుకున్న డబుల్‌రోడ్డు పనులు


జూలపల్లి వద్ద కొనసాగుతున్న రోడ్డు పనులు

జూలపల్లి: మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన పెద్దపల్లి–జూలపల్లి డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనులు నిర్వహిస్తున్నారు. లోకపేట నుంచి కాచాపూర్ వరకు రూ.9కోట్ల అంచనాలతో చేపట్టిన డబుల్ రోడ్డు మట్టి పనులు పూర్తి కాగా త్వరలోనే కంకర మిక్సింగ్, తారు పనులు చేపట్టేందుకు గుత్తేదారు పనులు ముమ్మరం చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో కాచాపూర్ నుంచి జూలపల్లి వరకు రూ.19.80 కోట్లతో చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు శర వేగంగా కొనసాతున్నాయి.

విమలక్కకు సన్మానం

రామగుండం: ప్రజాగాయకురాలు విమలక్కను శుక్రవారం గాయకుడు, రామగుండం కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

• రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగికి తీవ్రగాయాలు

ఫెర్టిలైజర్‌సిటీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గేట్ నుంచి 8 ఇంక్లైన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం బైక్‌ను మహేంద్ర క్యాంపర్ వాహనం ఢీకొన్నంది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న బ్యాంక్ ఉద్యోగి కాసర్ల రాములు తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితులు తెలిపిన కథనం ప్రకారం ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో నివాసముండే కాసర్ల రాములు 8 ఇంక్‌లైన్ కాలనీ జల్లారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి విధులకు వెళ్లే క్రమంలో వీర్లపల్లి బ్రిక్ ప్లాంట్ సమీపానికి రాగానే బొలెరో క్యాంపర్ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న రాములు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గోదావరిఖని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మహేంద్ర క్యాంపర్ వాహనం డ్రైవర్ పరారయ్యాడు. బాధితుడి భార్య సుమలత గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మంథని: కాంగ్రెస్ తన ఉగ్రవాద రూపాన్ని మరోసారి బయటపెట్టిందని బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్ అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత ఉత్తరప్రదేశ్ మాజీ ఎంపీ ఉదిత్‌రాజ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

• ఉరివేసుకుని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

గోదావరిఖని: స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన కర్రావుల శ్రీనివాస్(55) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ ఎస్సై భూమేశ్ తెలిపారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన శ్రీనివాస్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని అఘాయిత్యానికి పాల్పడినట్లు వివరించారు. మృతుడి భార్య కర్రావుల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

• భార్యపై యత్నాయత్నం చేసిన హోంగార్డుపై కేసు నమోదు

గోదావరిఖని: భార్యపై యత్నాయత్నం చేసిన రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ఆవుల గట్టయ్యపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ రెండో సీఐ రవీందర్ తెలిపారు. గోదావరిఖనిలో నివాసం ఉంటున్న గట్టయ్య శుక్రవారం భార్య రామలక్ష్మిపై దాడిచేసి చంపే ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. ఆమెను మానసికంగా వేధించడంతో పాటు దాడికి దిగాడన్నారు. గోడకేసి బలంగా కొట్టడంతో ఈ ఘటనలో తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితికి చేరిన రామలక్ష్మిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు గట్టయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం: మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. ముత్తారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో జేఎన్‌టీయూ, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలలు, మోడల్, కేజీబీవీలు తీసుకువచ్చిన ఘనత శ్రీధర్ బాబుదేనన్నారు. ప్రజల్లో ఉనికి కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న శ్రీధర్‌బాబుపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. పార్టీ నాయకులు మద్దెల రాజయ్య, గాదం శ్రీనివాస్, వినీత్, సమ్మయ్య, శంకర్, లక్కం ప్రభాకర్ ఉన్నారు.



సుల్తానాబాద్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పనులు జరుగుతున్న క్రమంలో కాంట్రాక్టర్లు రోడ్డుకు అడ్డంగా కంకర, ఇసుక ఇతర సామగ్రి వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నెలల కొద్ది రోడ్డుపై ఇసుక, కంకర ఉండడంతో ప్రమాదాలకు కారణం అవుతోందని వారు వాపోతున్నారు. చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి


మాట్లాడుతున్న జీఎం బండి వెంకటయ్య

గోదావరిఖని: నిర్దేశిత వార్షిక లక్ష్యాల సాధనలో సమష్టిగా ముందుకు సాగాలని, రక్షణతో కూడిన పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య సూచించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓసీపీ-3, వకీల్‌పల్లిగని ఉత్పత్తికి సంబంధించిన తీరు, యంత్రాల పనితీరు, విడి భాగాలు, పనిస్థలాలు తదితర అంశాలపై చర్చించారు. సంస్థ నిర్దేశిత లక్ష్యాలు సాధించడానికి ప్రతీఒక్కరు సిద్ధంగా ఉండాలని, తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. యంత్రాలను పూర్తి గంటలు వినియోగిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రాముడు, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ప్రాజెక్టు అధికారి నెహ్రూ, ప్రాజెక్టు ఇంజినీర్ రాజాజీ, రక్షణ అధికరి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్ల కేటాయింపు


కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని సింగరేణి క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించారు. కేటగిరీ-1 నుంచి 6 వరకు ఉన్న ఉద్యోగులకు స్థానిక సీఈఆర్ క్లబ్‌లో క్వార్టర్ల కౌన్సెలింగ్ చేపట్టారు. 348 ఖాళీ క్వార్టర్లకు గాను 223మంది దరఖాస్తు చేసుకోగా అర్హత, కేటగిరీ బట్టి క్వార్టర్లను కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, సీనియర్ పర్సనల్ అధికారి హనుమంతరావు, సంక్షేమాధికారులు, ఇక్బాల్ షరీఫ్, రవీందర్, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

జీడీకే–5 ఓసీపీ క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ


క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-5 ఓసీపీ క్యాంటీన్‌ను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో భోజనం, అల్పాహారం రుచిని పరిశీలించారు. నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జీఎం వెంట ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ సర్వే అధికారి డీటీ చంద్రమౌళి, వెల్ఫేర్ ఆఫీసర్ ఫిరోజ్, గుర్తింపు సంఘం నాయకులు అరెల్లి పోశం, మహేశ్, ప్రభుదాస్ ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి


పుస్తకం ఆవిష్కరిస్తున్న మండల విద్యాధికారి

ధర్మారం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ఆసక్తితో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. ధర్మారం మండలం నర్సింహులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన పల్లెటూరి పిల్ల గాండ్లు పుస్తకాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. విద్యార్థులు ఏ విషయాన్నైనా ఆసక్తితో నేర్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఇందుకు నిదర్శనమే పల్లెటూరు పిల్లగాండ్లు ఆత్మకథల పుస్తకమన్నారు. ఈ కథనాలను తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎర్రోజు వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బొజ్జ నరేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రజిత, ఉపాధ్యాయులు పుష్పలత, శ్రీనివాస్, చక్రవర్తి, రాంచంద్రారెడ్డి, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

233 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఓదెల: గ్రామశివారులో 233క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం రాత్రి అధికారులు పట్టుకున్నారు. పెద్దపల్లి సివిల్ సప్లయి అధికారుల కథనం ప్రకారం గ్రామశివారులో జీపు, ఆటోలో నుంచి లారీలో లోడ్ చేస్తుండగా.. అధికారులు అక్కడకు వెళ్లారు. బియ్యాన్ని పరిశీలించగా పీడీఎస్ రైస్‌గా తేలాయి. దీంతో నలుగురిని గుర్తించి కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సుల్తానాబాద్ గోదాంలోకి తరలించి, వాహనాలను పొత్కపల్లి పోలీసులకు అప్పగించారు.

క్లుప్తంగా

రేపటి నుంచి పెద్దాపూర్ మల్లన్న ఉత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీమల్లికార్జునస్వామి పట్నాల ఉత్సవాలు 23న ప్రారంభం కానున్నట్లు యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీకే యాదవ్ తెలిపారు. 23న ఆదివారం సాయంత్రం ఒగ్గు పూజారుల డోలుచప్పుళ్లతో పుట్ట బంగారం తీసుకురావడం, సోమవారం లగ్నంపట్నం, మంగళవారం జోగు, బుధవారం నాగవెల్లి పట్నం, సాయంత్రం అగ్నిగుండాల కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, చలువ పందిళ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలు


పూలమాల వేస్తున్న అధికారులు


రామగుండం: రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్, రామగుండం ఇన్‌చార్జి తహసీల్దార్ ఈశ్వర్, అంతర్గాం ఎంపీడీవో వేణు, పాలకుర్తి ఎంపీడీవో రామ్మోహన్‌తో పాటు సిబ్బంది, సేవాలాల్ టెంపుల్ కమిటీ సభ్యులు బదావత్ సారయ్య నాయక్, శంకర్‌నాయక్, జరుపుల సమ్ము నాయక్, బానోత్ సురేశ్‌నాయక్, ఇస్లావత్ సారయ్య పాల్గొన్నారు.

అర్హులకే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి


మాట్లాడుతున్న హరిప్రసాద్

రామగుండం: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌సింగ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల స్వభావాన్ని గుర్తించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంతోమంది అనర్హులు బరిలో ఉన్నారన్నారు. కొంతమంది బీసీ అభ్యర్థులు బీసీల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తుండడంతో బీసీలు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఐక్యవేదిక నాయకులు గొట్టం మహేష్, పొన్నం అనిల్‌గౌడ్, పూసాల రణదీర్, రారోజుల శివకుమార్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయండి


మద్దతు కోరుతున్న ప్రకాశ్‌రెడ్డి

మంథని: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి కోరారు. శుక్రవారం మంథనిలోని బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులను కలిసి మద్దతు కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

ఓదెల మండలంలో విద్యుత్ మోటార్లు చోరీ

ఓదెల: మండలంలోని కొలనూర్, ఓదెల, ఉప్పరపల్లె గ్రామాల్లో విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. కొలనూర్ గ్రామంలో దొడ్డె రత్నాకర్, దొడ్డె శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ పంపు మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దివ్యాంగుడికి చెందిన విద్యుత్ మోటార్‌ను వరసగా రెండుసార్లు ఎత్తుకెళ్లడంతో పంటచేతికి వచ్చే సమయానికి నీళ్లు అందక పంట ఎండిపోతోందని రైతు రత్నాకర్ వాపోయాడు. మండలంలోని పలు గ్రామాల్లో దొంగలముఠా రాత్రి విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడుతున్నారని రైతులు చెప్తున్నారు.